# నమస్తే తెలంగాణ

# రంగారెడ్డి

I | హైదరాబాద్, శుక్రవారం 11 అక్టోబర్ 2024 | RANGAREDDY




## కనుల పండువగా దేవీశరన్నవరాత్రోత్సవాలు

ఉమ్మడి జిల్లాలో దేవీశరన్నవరాత్రి మహోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. దుర్గాష్టమి సందర్భంగా గురువారం అనేక ఆలయాలు, పలు మండపాల్లో దుర్గామాతగా అలంకరించారు. భక్తులు తెల్లవారుజాము నుంచే అమ్మవారికి ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు చేయగా, పలుచోట్ల కుంకుమార్చన, కలశపూజలు, హోమాలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. షాద్‌నగర్ పట్టణంలోని శ్రీ శివమారుతిగీతా అయ్యప్ప మందిరంలో అమ్మవారు శ్రీ దుర్గాదేవిగా దర్శనమిచ్చారు.

## హెచ్‌ఎండీఏ తరలింపునకు బ్రేక్ ?

### మైత్రీవనంలోనే కార్యాలయం కొనసాగించేలా చర్యలు

సిటీబ్యూరో, అక్టోబర్ 10 (నమస్తే తెలంగాణ) : మైత్రీవనంలోని స్వర్ణజయంతి కాంప్లెక్స్ నుంచి బేగంపేట పైగా ప్యాలెస్‌కు తరలించే పనులకు బ్రేక్ పడినట్లుగా తెలుస్తున్నది. ఆగస్టు మొదటి వారంలోనే హెచ్‌ఎండీఏ విభాగాలన్నింటినీ ఒకే చోటుకు తరలించేలా జీవోలు జారీ చేశారు. అందుకు అనుగుణంగా పైగా ప్యాలెస్‌లో ఇంజినీరింగ్ అధికారులు ఏర్పాట్లు చేపట్టారు. ప్రస్తుతం ఇంటీరియర్ పనులు సాగుతుండగా... తాజాగా పైగా ప్యాలెస్‌కు కార్యాలయం తరలింపునకు బ్రేక్ పడినట్లు తెలిసింది. తరలింపునకు సంబంధించిన ఆరు నెలల కిందటే జీవో జారీ చేసి, తీరా ఇంటీరియర్ పనులు ముగిసిన తర్వాత తరలింపు నిలిపివేయడం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. పైగా ప్యాలెస్ విషయంలో ప్రభుత్వం ఇచ్చే ఆదేశాలకు అనుగుణంగా నిర్ణయం ఉంటుందని, హైడ్రా ఆఫీసును అక్కడే ఏర్పాటు చేసే యోచనలో ఉన్నట్లు తెలిసింది. అయితే దీనికి సంబంధించిన ఎలాంటి అధికారిక ప్రకటన రాలేదు. కానీ పైగా ప్యాలెస్‌కు హెచ్‌ఎండీఏ తరలించొద్దని స్పష్టమైన సూచనలు ఇప్పటికే అధికారులకు ప్రభుత్వం చేసినట్లు సమాచారం.



శంకర్‌పల్లి మున్సిపల్ పరిధిలోని ఫతేపూర్‌లో బతుకమ్మ ఆడుతున్న మహిళలు, చిన్నారులు



# పూల జాతర

## ఘనంగా సద్దుల బతుకమ్మ


ఉమ్మడి రంగారెడ్డి జిల్లావ్యాప్తంగా గురువారం సద్దుల బతుకమ్మ సంబురాలు అంగరంగ వైభవంగా జరిగాయి. పల్లెలు, పట్టణాల్లోని ప్రధాన కూడళ్ల వద్ద రంగురంగుల పూలతో పేర్చిన బతుకమ్మలను ఉంచి లయబద్ధంగా చప్పట్లతో ఆడపడుచులు పాడిన పాటలు అలరింపజేశాయి. రామ రామ రామ ఉయ్యాలో.. రామనే శ్రీరామ ఉయ్యాలో.. అంటూ ఆడబిడ్డలు ఆడిపాడారు. చిన్నాపెద్ద పటాకులు కాల్చుతూ సందడి చేశారు. అనంతరం డప్పు చప్పుళ్లు, బాజాభజంత్రీలతో ఊరేగింపుగా బతుకమ్మలను తీసుకువెళ్లి స్థానిక చెరువుల్లో నిమజ్జనం చేశారు.



కడ్తాల్‌లో బతుకమ్మ ఎత్తుకున్న యువతి



ఆర్‌కే పురం కాలనీలో జరిగిన బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితారెడ్డి



మర్పల్లి మండలంలోని పంచలింగాల్‌లో..



# బియ్యం..అయోమయం

*సీజన్లకు సీజన్లు గడిచిపోతున్నాయి. కానీ.. రంగారెడ్డి జిల్లాలో మిల్లర్ల నుంచి కస్టమ్స్ మిల్లింగ్ రైస్(సీఎంఆర్) మాత్రం వెనక్కి రావడంలేదు. సీఎంఆర్ ఇవ్వడంలో మిల్లర్లు నిర్లక్ష్యం కనబరుస్తున్నారు. ప్రభుత్వ ఆదేశాలను సైతం ఖాతరు చేయడంలేదు. ఇప్పటికే పలుమార్లు గడువు పొడిగించినప్పటికీ మిల్లర్లు మొండికేస్తున్నారు. జూన్ 30 నాటికే లక్ష్యం పూర్తి చేయాల్సి ఉన్నప్పటికీ మిల్లర్ల విజ్ఞప్తి మేరకు ప్రభుత్వం గడువును మరో 90 రోజులకు పొడిగించింది. అది కూడా గత సెప్టెంబర్ 30తో ముగిసింది. 2022-23 నుంచి వానకాలం, యాసంగి సీజన్లకు కలిపి ఇవ్వాల్సిన సుమారు 16,600 మెట్రిక్ టన్నుల బియ్యం ఇంకా పెండింగ్‌లోనే ఉంది. అధికారులు నోటీసులతోనే సరిపెడుతుండడంతో మిల్లర్లు అలసత్వం వహిస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి.*

*- రంగారెడ్డి, అక్టోబర్ 10 (నమస్తే తెలంగాణ)*

### ప్రతీ సంవత్సరం ఇదే తంతు..

పౌర సరఫరాల సంస్థ నిబంధనల మేరకు ప్రతీ సంవత్సరం సీజన్‌కు సంబంధించి ఆరు నెలల్లో మిల్లులకు కేటాయించిన ధాన్యానికి బియ్యం సేకరణ చేయాల్సి ఉంటుంది. అయితే కొంతమంది రైస్ మిల్లర్ల తీరు వల్ల ప్రతి సీజన్‌లోనూ సీఎంఆర్ ప్రక్రియలో జాప్యం జరుగుతూనే ఉన్నది. 2022-23 సీజన్‌కు సంబంధించిన ధాన్యాన్ని సైతం మరాడించడంలో మిల్లర్ల నిర్లక్ష్యం కొట్టొచ్చినట్లు కనిపిస్తున్నది. ఈ సీజన్‌కు సంబంధించి 9వేల మెట్రిక్ టన్నుల బియ్యాన్ని మిల్లర్లు అప్పగించాల్సి ఉన్నది. అలాగే.. 2023-24 యాసంగి, వానకాలానికి సంబంధించి 13 రా రైస్ మిల్లులకు, 5 బాయిల్డ్ మిల్లులకు ప్రభుత్వం ధాన్యాన్ని అప్పగించింది. ఇందులో వానకాలం సాగుకు సంబంధించి 582.443 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సీఎంఆర్ కింద మిల్లర్లు ఇవ్వాల్సి ఉండగా ఇవ్వలేదు. యాసంగికి సంబంధించి 7,101.521 (54 శాతం) బియ్యం మిల్లర్ల వద్దే ఉన్నది. సీఎంఆర్‌పై కేంద్రం ఇప్పటివరకు అనేకమార్లు గడువు పొడిగిస్తూ వచ్చింది. చివరగా.. గత సెప్టెంబర్ 30 వరకు పొడిగించింది. మిల్లర్లతో తరచూ సమావేశాలు నిర్వహించడంతోపాటు పౌరసరఫరాల శాఖ అధికారులు మిల్లుల్లో తనిఖీలు జరిపి ఒత్తిడి తెచ్చినప్పటికీ ఫలితం రావడంలేదు. మరోసారి కేంద్రం గడువు పెంచుతుందేమోనన్న ఆశలో మిల్లర్లు ఉన్నారు.

### బహిరంగ మార్కెట్లో అమ్ముకోవడంతోనే..

ప్రభుత్వం కేటాయించిన ధాన్యాన్ని బియ్యంగా మార్చుకుని బహిరంగ మార్కెట్లో అమ్ముకోవడంతోనే మిల్లర్ల వద్ద సీఎంఆర్ బకాయిలు పేరుకుపోయినట్లు తెలుస్తున్నది. ఎఫ్‌సీఐకి అందజేయాల్సిన ఒక సీజన్‌లోని బియ్యాన్ని వాయిదా వేస్తూ మరొక సీజన్‌లో వచ్చే ధాన్యాన్ని మిల్లింగ్ చేసి ఇస్తున్నారు.

**ఎన్నిమార్లు గడువు పెంచినా సీఎంఆర్ ఇవ్వడంలో మొండికేస్తున్న మిల్లర్లు**

**చివరగా.. గత సెప్టెంబర్ 30తో ముగిసిన గడువు**


**2022-23 వానకాలం కోటానే పూర్తికాని వైనం**

**2023-24 రెండు సీజన్లకు సంబంధించి 7,600 మెట్రిక్ టన్నులు పెండింగ్**

**సీజన్లు గడిచిపోతున్నా.. సీఎంఆర్ బియ్యం సేకరణలో ఎడతెగని జాప్యం**

**నోటీసులతో సరిపెడుతున్న సివిల్ సప్లయ్ అధికారులు**

**ప్రస్తుత వానకాలంలో 80వేల మెట్రిక్ టన్నుల ధాన్యం వస్తుందని అంచనా**



అధికారులు ఒత్తిడి చేసిన సందర్భంలో కొందరు మిల్లర్లు బ్లాక్ మార్కెట్‌కు తరలించే రేషన్ బియ్యాన్ని రీసైక్లింగ్ చేసి సర్దుబాటు చేస్తున్నారన్న ఆరోపణలు సైతం ఉన్నాయి. కడ్తాల్ మండలం మక్తమాదారం గ్రామంలోని ఓ రా రైస్ మిల్లు యజమాని 2021-22 సంవత్సరానికి సంబంధించిన 241 టన్నుల సీఎంఆర్ రైస్‌ను ప్రభుత్వానికి అప్పగించడంలో నిర్లక్ష్యాన్ని కనబరుస్తూ వస్తున్నారు. దీనిపై పలుమార్లు నోటీసులు ఇచ్చిన అధికారులు ఆర్‌ఆర్ యాక్ట్‌ను ప్రయోగించేందుకు సిద్ధమవుతున్నట్లు తెలిసింది. ప్రస్తుత వానకాలం పంటలకు సంబంధించి కొన్ని చోట్ల వరి కోతలు మొదలయ్యాయి. ధాన్యం కొనుగోళ్లకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తున్నది. దొడ్డు రకాలతో పాటుగా తొలిసారిగా సన్న రకాలను వేర్వేరుగా కొనుగోలు చేయనున్నారు. ఈ సీజన్‌లో కొనుగోలు కేంద్రాల ద్వారా 80 వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించాలని పౌరసరఫరాల శాఖ సంకల్పిస్తున్నది. గత సీజన్లకు సంబంధించిన బియ్యమే మిల్లర్ల వద్ద పెండింగ్‌లో ఉండడంతో ప్రస్తుత వానకాలం సీజన్‌కు సంబంధించిన ధాన్యాన్ని మిల్లర్లకు అప్పగించే విషయంలో ప్రభుత్వం నిబంధనలను మరింత కఠినతరం చేయనున్నది. బ్యాంకు గ్యారంటీ ఇస్తేనే సదరు మిల్లులకు ధాన్యాన్ని కేటాయించాలని ప్రభుత్వం ఆలోచన చేస్తున్నట్లు సమాచారం.

## 15న నేవీ రాడార్‌కు శంకుస్థాపన

### సీఎం రేవంత్, మంత్రి సురేఖలకు ఆహ్వానపత్రికల అందజేత



సీఎం రేవంత్‌రెడ్డికి ఆహ్వానపత్రిక అందజేస్తున్న పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి, నేవీ రాడార్ ప్రాజెక్టు డైరెక్టర్ రాజ్‌బీర్‌సింగ్

పరిగి, అక్టోబర్ 10 : పరిగి మండలం దామగుండంలో ఏర్పాటు చేయనున్న నేవీ రాడార్ ప్రాజెక్టు శంకుస్థాపన ఈ నెల 15వ తేదీన నిర్వహించేందుకు నిర్ణయించారు. ఈ మేరకు గురువారం పరిగి ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి, ప్రాజెక్టు డైరెక్టర్ రాజ్‌బీర్‌సింగ్, నేవీ అధికారులు సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి శంకుస్థాపన కార్యక్రమానికి ఆహ్వానపత్రిక అందజేశారు. రాష్ట్ర మంత్రి కొండా సురేఖను సైతం కలిసి శంకుస్థాపనకు ఆహ్వానించారు.

## ఎమ్మెల్యేకు సొంత పార్టీ నేతలతోనే నిరసన సెగ..

చేవెళ్ల రూరల్, అక్టోబర్ 10 : ఎమ్మెల్యే యాదయ్యకు కాంగ్రెస్ పార్టీ నేతలతోనే నిరసన సెగ తగిలింది. శంకర్‌పల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీలో డైరెక్టర్ నియామకంపై స్థానిక నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ మున్సిపల్ ఆఫీస్‌లో ఎమ్మెల్యేకు ఎదురు తిరిగారు. కొండకల్ గ్రామంలో వ్యవసాయ మార్కెట్ చైర్మన్ పదవి, డైరెక్టర్ పదవులు ఎందుకు కేటాయించారని, కాంగ్రెస్ పార్టీలో కష్టపడ్డవారికి అవకాశం ఎందుకు కల్పించడం లేదని ఎమ్మెల్యేపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఆందోళన చేపట్టడంతో పోలీసులు కలుగజేసుకొని సముదాయించడంతో గొడవ సద్దుమణిగింది.



శంకర్‌పల్లి మున్సిపల్ కార్యాలయం ఎదుట ఎమ్మెల్యే కాలె యాదయ్య డౌన్‌డౌన్ అంటూ నినాదాలు చేస్తున్న కాంగ్రెస్ శ్రేణులు